# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

ఎనిమిదవ పాఠము

విప్పుతమగుచున్న యుగాంతశాస్త్రము

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ........ 1
మోషే యొక్క యుగాంతశాస్త్రము ........ 1
నిబంధనా వృత్తములు ........ 2
నిబంధనా ముగింపు ........ 2
ఆరంభ ప్రవచనాత్మక యుగాంతశాస్త్రము ........ 4
మోషేకు సారుప్యతలు ........ 4
మోషేకు అదనముగా చేర్చబడినవి ........ 5
రాజత్వము ........ 6
దేవాలయము ........ 7
అన్యజనులు ........ 7
తరువాత ప్రవక్తల యుగాంతశాస్త్రము ........ 9
యిర్మీయా ప్రవచనము ........ 10
దానియేలు అంతర్దృష్టి ........ 11
అంతిమ దృక్పథములు ........ 13
ఆరంభ నిరీక్షణలు ........ 13
అంతిమ నిరీక్షణలు ........ 14
క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము ........ 15
పదములు ........ 15
సువార్త ........ 15
రాజ్యము ........ 16
అంత్యదినములు ........ 17
నిర్మాణం ........ 17
బాప్తిస్మమిచ్చు యోహాను ........ 18
యేసు ........ 18
అంశాలు ........ 19
చెర ........ 19
పునరుద్ధరణ ........ 20
ముగింపు ........ 21





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

ఎనిమిదవ పాఠము

వివృతమగుచున్న యుగాంతశాస్త్రము

## ఉపోద్ఘాతము

నేను పెరుగుతున్న వయస్సులో, నా కుటుంబము అంతా కారులో సెలవలకు వెళ్లేవారము, మరియు మా మనస్సులో గమ్యమును గూర్చి ఒక స్పష్టత కలిగియుండేవారము మరియు గమ్యము చేరేవారము. అయితే మార్గమధ్యలో, ప్రణాళికను వివృతము చేయు వివిధ విషయాలు జరిగేవి. మేము ఒక స్థలములో అనుకున్న దానికంటే ఎక్కువ సమయము ఆగేవారము, లేదా టైరు పంక్చరు అవ్వడం, ఇలాటివి జరిగేవి.

సరే, పాత నిబంధన ప్రవచనము విషయములో కూడా ఇలాటిదే జరిగింది. మానవ చరిత్ర యెడల దేవుడు ఒక సార్వభౌమ ప్రణాళికను కలిగి ఉన్నాడు, మరియు ఆ ప్రణాళిక దాని యొక్క గమ్యముకు చేరుతుంది, మరియు మార్గములోని ప్రతి అడుగును దేవుడు సార్వభౌమ ప్రణాళికతో చేశాడు. అయితే అదే సమయములో ప్రవచనము పట్ల మానవులు ఏ విధమైన స్పందన కలిగి ఉన్నారో దేవుడు తన దైవకృతములో చూస్తాడు అని మనకు తెలుసు, మరియు వారు ఒక విధముగా స్పందించినప్పుడు ఆయన మరొక విధంగా స్పందిస్తాడు; వారు మరొక విధముగా స్పందించినప్పుడు ఆయన వేరొక విధముగా స్పందిస్తాడు. కాబట్టి మనము బైబిలు అంతటిలో వివృతమగుచున్న గమ్యము, లేదా ఎస్కటాన్ ను కనుగొంటాము. బైబిలు కొనసాగుచుండగా దేవుడు తన ప్రజల కొరకు ఏమి చేయబోవుచున్నాడో మరింత ఎక్కువగా ఆయన వెల్లడిస్తాడు.

ఈ పాఠమునకు మనము "వివృతమగుచున్న యుగాంతశాస్త్రము" అను పేరు పెట్టాము ఎందుకంటే ప్రవచన గ్రంథములలో వివిధ దశల ద్వారా అంత్యకాలము లేదా ఎస్కటాలజి యొక్క ప్రవచనాత్మక దృష్టి ఎలా పురోగమనము చెందినదో మనం చూస్తాము. వివృతమగుచున్న యుగాంతశాస్త్రము యొక్క నాలుగు ప్రధాన దశలను పరిశీలిద్దాము, వీటిని మనము ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవాలి: మొదటిగా, మోషే యొక్క యుగాంతశాస్త్రము; రెండవదిగా, ఆరంభ ప్రవక్తల యుగాంతశాస్త్రము; మూడవదిగా, తరువాత ప్రవక్తల యుగాంతశాస్త్రము; మరియు నాలుగవదిగా, క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము. మోషే ద్వారా వెలువడిన దృక్పథములను ముందుగా పరిశీలించుదాము.

## మోషే యొక్క యుగాంతశాస్త్రము

మీరు ఎప్పుడైనా అత్యంత కఠిన పరిస్థితులలో ఉన్నప్పుడు, ఒక దినమున ఈ కఠిన పరిస్థితులకు అంతము ఉంటుంది అనే నమ్మకమును కలిగి ఉన్నారా? సరే, చాలా సందర్భములలో, మోషే ఈ విధమైన దృక్పథమును ఇశ్రాయేలుకు ఇచ్చాడు. వాగ్దాన భూమి నుండి చెరగొనిపోబడినప్పుడు కష్ట పరిస్థితులు వస్తాయని అతడు ఇశ్రాయేలుకు చెప్పాడు, అయితే ఒక దినమందు సమస్తము సరైపోతాయను నిరీక్షణను, యుగాంతపు నిరీక్షణను కూడా అతడు వారికి ఇచ్చాడు. మోషే దృక్పథాలను



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి.

అర్థం చేసుకోవాలంటే, మునుపటి పాఠంలో మనం ఇప్పటికే చూసిన కొన్ని ప్రాథమిక నిబంధనా క్రియాశీలకములను పరిశీలించాలి: మొదటిగా, నిబంధనా వృత్తములు; రెండవదిగా, నిబంధన ముగింపు.

## నిబంధనా వృత్తములు

దేవుడు తన ప్రజల యొక్క స్వామిభక్తిని పరీక్షిస్తాడని మరియు ఆయన ప్రజలు ఎల్లప్పుడూ విఫలమౌతారు అని మోషే అర్థం చేసుకున్నట్లుగా మనం జ్ఞాపకం చేసుకుంటాము. తత్ఫలితంగా, తరచుగా వచ్చు తీర్పులు మరియు ఆశీర్వాదములు దేవునికి మరియు ఆయన ప్రజలకు మధ్య సంబంధమును వివరిస్తాయని మోషే బోధించాడు. దేవుని ప్రజలు ఆయన మీద తీవ్రంగా తిరుగుబాటు చేసినప్పుడు, వారు యుద్ధము మరియు ప్రకృతి ద్వారా కలుగు తీర్పును అనుభవించారు. దేవుని ప్రజలు ఆయనకు నమ్మకముగా ఉన్నప్పుడు, వారు యుద్ధము మరియు ప్రకృతి ద్వారా కలుగు ఆశీర్వాదములను అనుభవించారు. ఆశీర్వాదము మరియు తీర్పు మధ్యగల ఈ వృత్తాకార నిబంధనా విధానము పాత నిబంధన అంతటా చాలాసార్లు కనిపిస్తుంది.

## నిబంధనా ముగింపు

ఇప్పుడు మోషే రచనలలోని యుగాంతశాస్త్రము ఈ ప్రాథమిక ఆశీర్వాదము మరియు తీర్పు నుండి పురోగమనము చెందుతుంది. మోషే ప్రకారము, నిబంధన యొక్క తీర్పులు మరియు ఆశీర్వాదములు నిత్య వృత్తములో కొనసాగవు, ఎన్నడును ఏ లక్ష్యం వైపుకు వెళ్లవు. విరుద్ధంగా చెప్పాలంటే, మోషే భవిష్యత్తులో ఒక నిర్దిష్టమైన ముగింపును లేదా ఎస్కటాన్ ను చూశాడు. నిబంధన జీవితముకు ముగింపును, లేదా ఎస్కటాన్ ను గూర్చి మోషే ఏమి బోధించాడో అర్థం చేసుకోవాలంటే, చరిత్ర మీద అతడు కలిగియున్న దృక్పథములోని మూడు విషయములను మనము పరిశీలన చేయాలి: మొదటిగా, చెర; రెండవదిగా, పశ్చాత్తాపము మరియు క్షమాపణ; మరియు మూడవదిగా, చెర నుండి పునరుద్ధరణ.

మొదటిగా, ఇశ్రాయేలు దేవుని నుండి దూరముగా వెళ్తున్న కొద్దీ తీర్పులు పెరిగుతాయని మోషే భావించాడు. తీర్పులోని ఈ పెరుగుదల వాగ్దాన భూమి నుండి ఇశ్రాయేలు చెరగొనిపోబడుటతో ముగుస్తుంది. దేవుని ప్రజలు యుద్ధములో ఓటమిని అనుభవిస్తారు, మరియు వాగ్దాన భూమిలో ప్రకృతి యొక్క సామరస్యం ప్రకృతి యొక్క క్షయతగా మారుతుంది. దేవుని ప్రజలు అన్యదేశములలో చెదరిపోతారు, మరియు వాగ్దాన భూమి శిధిలావస్థలో ఉంటుంది. ద్వితీయోపదేశకాండము 4:25-28లో దీనిని గూర్చి మోషే చెప్పిన విధానమును వినండి:

> మీరు పిల్లలను పిల్లల పిల్లలను కని ఆ దేశమందు బహు కాలము నివసించిన తరువాత మిమ్మును మీరు పాడుచేసికొని, యే స్వరూపము కలిగిన విగ్రహమునైనను చేసి నీ దేవుడైన యెహోవాకు కోపము పుట్టించి ఆయన కన్నుల యెదుట కీడు చేసినయెడల మీరు ఈ యొర్దాను దాటి స్వాధీనపరచుకొనబోవు దేశములో ఉండకుండ త్వరలోనే బొత్తిగా నశించిపోదురని భూమ్యాకాశములను మీమీద సాక్షులుగా ఉంచుచున్నాను. ఆ దేశమందు బహు దినములుండక మీరు

> బొత్తిగా నశించిపోదురు. మరియు యెహోవా జనములలో మిమ్మును చెదరగొట్టును; యెహోవా ఎక్కడికి మిమ్మును తోలివేయునో అక్కడి జనములలో మీరు కొద్దిమందే మిగిలియుందురు. అక్కడ మీరు మనుష్యుల చేతిపనియైన కఱ్ఱ రాతిదేవతలను పూజించెదరు; అవి చూడవు, వినవు, తినవు, వాసన చూడవు. (ద్వితీయోపదేశకాండము 4:25-28).

ఒక భయంకరమైన చెర వస్తుంది అని మోషే ఊహించినట్లుగా ఇక్కడ మనం చూస్తాము, అయితే ఈ చెర ఎంత భయంకరముగా ఉన్నప్పటికీ, ఇశ్రాయేలుతో దేవుని నిబంధన యొక్క చరిత్రకు ఇది ముగింపు కాదు. పశ్చాత్తాపము మరియు క్షమాపణ చెర యొక్క పరిస్థితిని మార్చగలదు. 4:29లో మోషే చెప్పినట్లుగా:

> అయితే అక్కడ నుండి నీ దేవుడైన యెహోవాను మీరు వెదకినయెడల, నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను వెదకునప్పుడు ఆయన నీకు ప్రత్యక్షమగును (ద్వితీయోపదేశకాండము 4:29).

ఒకసారి చెర సంభవించిన తరువాత, దేవుని ప్రజలు స్పృహలోకి వచ్చి, పశ్చాత్తాపపడి, దేవుని నుండి క్షమాపణ పొందుకుంటారు.

ఈ పశ్చాత్తాపము మరియు క్షమాపణ యొక్క ఫలితము ఏమిటి? ఒక మాటలో చెప్పాలంటే, ఇది చెర నుండి పునరుద్ధరణను కలిగిస్తుంది. దేవుడు ఆయన ప్రజల మీద కనికరపడి ఊహించలేని నిబంధనా అశీర్వదముల శాశ్వత స్థితిని ఆస్వాదించడానికి వాగ్దాన భూమికి వారిని తిరిగి తీసుకువస్తాడని మోషే బోధించాడు. ద్వితీయోపదేశకాండము 4:30-31లో నిబంధన ఆశీర్వాదము యొక్క ముగింపును గూర్చి మోషే ఎలా వివరించాడో వినండి:

> ఈ సంగతులన్నియు నీకు సంభవించిన తరువాత నీకు బాధ కలుగునప్పుడు అంత్యదినములలో నీవు నీ దేవుడైన యెహోవావైపు తిరిగి ఆయన మాట వినినయెడల నీ దేవుడైన యెహోవా కనికరముగల దేవుడు గనుక నిన్ను చెయ్యి విడువడు; నిన్ను నాశనముచేయడు; తాను నీ పితరులతో ప్రమాణము చేసిన నిబంధనను మరచిపోడు (ద్వితీయోపదేశకాండము 4:30-31).

4:30లో, చివరి పునరుద్ధరణ యొక్క ఈ కాలముకు మోషే ఒక సాంకేతిక పదమును రూపొందించాడు. చెర సంభవించిన తరువాత ఇశ్రాయేలు యొక్క పునరుద్ధరణ "అంత్యదినములలో" జరుగుతుంది అని అతడు చెప్పాడు. ఈ వ్యక్తీకరణము వెనుక ఉన్న హెబ్రీ పదము *బహారిత్ హయ్యామిమ్* (*בְּאַחֲרִית הַיָּמִים*). అనేక సందర్భాలలో ఈ విధమైన భాష ఒక అనిశ్చిత విధమైన "భవిష్యత్తు" అను అర్థము ఇస్తుంది. అయితే ఇక్కడ, ద్వితీయోపదేశకాండము 4:30లో "అంత్యదినములు" లేదా "చరిత్ర యొక్క ముగింపు" అను సాంకేతిక పదముల ప్రయోగమును మనం చూస్తాము. ఈ సాంకేతిక పద ప్రయోగము యెషయా 2:2; మీకా 4:1; మరియు హోషేయ 3:5తో పాటుగా ప్రవచన గ్రంథములలో ఇతర అనేకచోట్ల కనిపిస్తుంది. క్రొత్త నిబంధనలో, ఇదే వ్యక్తీకరణము అపొస్తలుల కార్యములు 2:17; హెబ్రీయులకు 1:2; మరియు యాకోబు 5:3లో కనిపిస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే, ఈ విధమైన



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

వ్యక్తీకరణము ద్వారానే వేదాంత పదమైన “ఎస్కటాలజి” వెలువడుతుంది – అంత్యదినములు లేదా అంత్య సంఘటనలను గూర్చిన అధ్యయనము.

మోషే యొక్క యుగాంతశాస్త్రమును మనము ఈ విధముగా సంగ్రహించవచ్చు. ఇశ్రాయేలు తీవ్రమైన పాపములో పడిపోయి మరియు భూమి నుండి చెరగొనిపోబడుతుంది అని మోషేకు తెలుసు. అయితే ఒకసారి ప్రజలు భూమి నుండి బయటకు వెళ్లిన తరువాత, తమ పాపములను బట్టి పశ్చాత్తాపపడినట్లైతే, దేవుడు వారిని క్షమిస్తాడు. తరువాత, అంత్యదినములలో, లేదా ఎస్కటాన్లో, వారు వాగ్దాన భూమికి తిరిగి తీసుకొనిరాబడి అద్భుతమైన ఆశీర్వాదములను పొందుకుంటారు. మోషే యొక్కఈ ప్రాథమిక దృక్పథము ప్రవచనాత్మక ప్రవచనముల యొక్క చరిత్ర అంతటికి నేపథ్యమును అందిస్తుంది.

యుగాంతశాస్త్రమును గూర్చిన మోషే దృక్పథమును మనస్సులో ఉంచుకొని, పాత నిబంధన ఆరంభ ప్రవక్తల యొక్క యుగాంతశాస్త్రమును పరిశీలించడానికి మనం ఇప్పుడు సిద్ధంగా ఉన్నాము. బబులోనుకు చెరగొనిపోబడుటకు ముందు ప్రవక్తలు అంత్యదినములలో చరిత్ర యొక్క ముగింపును ఎలా చూశారు?

## ఆరంభ ప్రవచనాత్మక యుగాంతశాస్త్రము

ఇప్పుడు ఈ పాఠంలో, ఆరంభ ప్రవచనాత్మక ప్రవచనములను గూర్చి మాట్లాడునప్పుడు, దానియేలు కాలము వరకు పరిచర్య జరిగించిన ప్రవక్తలు మన మనసులో ఉంటారు. దానియేలు కాలము వరకు ఉన్న ప్రవక్తలు మోషే దృక్పథము వలె కనిపించే ఒక ప్రాథమిక యుగాంతశస్త్ర దృక్పథమును కలిగి ఉన్నారు. ఆరంభ ప్రవక్తల యుగాంతశాస్త్రము యొక్క రెండు కోణములను మనం చూద్దాము: మొదటిగా, మోషే దృక్పథముకు సారుప్యతలు; మరియు రెండవదిగా, మోషే దృక్పథముకు అదనముగా చేర్చబడినవి. మోషే ద్వారా స్థిరపరచబడిన ప్రాథమిక నమూనాలతో సారుప్యతలు కలిగియున్న ఆరంభ ప్రవచనాత్మక యుగాంతశాస్త్రమును మొదటిగా చూద్దాము.

### మోషేకు సారుప్యతలు

జాతీయ తీర్పు చెరకు నడిపిస్తుంది తదుపరి పశ్చాత్తాపము గొప్ప పునరుద్ధరణకు నడిపిస్తుంది, అను నమూనాను మోషే ప్రస్తుతించాడు. రాబోవు చెరను గూర్చి హెచ్చరించడానికి పాత నిబంధన ప్రవక్తలు ఎక్కువ సమయము కేటాయించారు. తదుపరి, మోషే తరువాత, దానియేలు కాలముకు ముందున్న ప్రవక్తలు చెరలో పశ్చాత్తాపము మరియు క్షమాపణ జరుగుతాయను నిరీక్షణను విడిచిపెట్టలేదు. వాస్తవంగా చెప్పాలంటే, దేవుడు చెరలోని తన ప్రజల శేషమును అతీద్రియంగా పునరుద్ధరించి వారికి క్షమాపణను అనుగ్రహిస్తాడని ప్రవక్తలు నమ్మారు. యెషయా 10:20లో, యెషయా దీనిని గూర్చి చెప్పినట్లుగా:

> ఆ దినమున ఇశ్రాయేలు శేషమును యాకోబు కుటుంబికులలో తప్పించుకొనిన వారును తమ్మును హతము చేసినవానిని ఇకను ఆశ్రయింపక సత్యమునుబట్టి ఇశ్రాయేలీయుల పరిశుద్ధ దేవుడైన యెహోవాను నిజముగా ఆశ్రయించెదరు (యెషయా 10:20).

చెరగొనిపోబడిన ప్రజలు నమ్మకముగా ఉండుటకు నూతన హృదయమును పొందుకొని దేవుని ధర్మశాస్త్రము యెడల విధేయత కలిగి ఉంటారని ప్రకటించినప్పుడు యిర్మీయా కూడా అదే విధంగా మట్లాడాడు. యిర్మీయా 31:33లో చెరలో ఉన్న వారిని గూర్చి మనము ఈ మాటలు చదువుతాము:

> వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముమీద దాని వ్రాసెదను; నేను వారికి దేవుడనై యుందును వారు నాకు జనులగుదురు (యిర్మీయా 31:33).

ఆరంభ ప్రవక్తలు చెరగొనిపోబడిన ప్రజలలో మారుమనస్సును ఆశించారు.

అయితే మూడవదిగా, పశ్చాత్తాపపడిన శేషము గొప్ప పునరుద్ధరణ కొరకు ఇశ్రాయేలు దేశమునకు తిరిగి వస్తారని ఆరంభ పాత నిబంధన ప్రవక్తలు కూడా ధృవీకరించారు. యెషయా మాటలు మరొకసారి సందర్భముకు సరిపోయిన విధంగా ఉన్నాయి. యెషయా 44:14లో మనము ఈ మాటలు చదువుతాము:

> యాకోబూ, ఇశ్రాయేలూ; వీటిని జ్ఞాపకము చేసికొనుము నీవు నా సేవకుడవు నేను నిన్ను నిర్మించితిని ఇశ్రాయేలూ, నీవు నాకు సేవకుడవై యున్నావు నేను నిన్ను మరచిపోజాలను. మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచివేసి యున్నాను నేను నిన్ను విమోచించియున్నాను, నాయొద్దకు మళ్లుకొనుము (యెషయా 44:21-22).

మోషే యొక్క ప్రాథమిక యుగాంతశాస్త్రము వాస్తవము అని ఆరంభ ప్రవక్తలు స్పష్టం చేశారు. ఇశ్రాయేలు చెరగొనిపోబడుతుంది మరియు పశ్చాత్తాపము మరియు క్షమాపణ భూమికి తిరిగి వచ్చుటకు సహాయం చేస్తాయి. అయితే ఆరంభ ప్రవక్తలు ఈ ప్రాథమిక మోషే నమూనాకు కొన్ని ప్రత్యేకమైన లక్షణములను కూడా చేర్చారు.

## మోషేకు అదనముగా చేర్చబడినవి

సులభంగా చెప్పాలంటే, మోషే మరియు ఆరంభ ప్రవక్తలకు మధ్య ఒక ప్రధానమైన నిబంధన సంఘటన జరిగింది, మరియు ఈ నిబంధన ఏమనగా, వాస్తవంగా చెప్పాలంటే, దావీదుతో చేయబడిన రాజత్వ నిబంధన. తత్ఫలితంగా, ఆరంభ యుగాంతశాస్త్రము, లేదా అంత్యదినములను గూర్చి మోషే కలిగి ఉండిన దృక్పథముకు అదనముగా ఆరంభ ప్రవక్తలు మూడు ప్రధానమైన అదనపు విషయాలను చేర్చారు. మొదటిగా, వారు రాజత్వము మీద దృష్టి పెట్టారు; రెండవదిగా, దేవాలయము మీద దృష్టి

పెట్టారు; మరియు మూడవదిగా, అన్యరాజ్యముల మీద దృష్టిపెట్టారు. ఆరంభ ప్రవక్తలు రాజత్వము మీద దృష్టిపెట్టిన విధానమును మొదటిగా చూద్దాము.

## రాజత్వము

ఒకవైపు, మోషే వలె కాకుండా, రాజ్యము ఓటమిని మరియు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటుంది అని మాత్రమే ఆరంభ ప్రవక్తలు చెప్పలేదు. ఈ ప్రవక్తల ప్రకారము, దావీదు సింహాసనము దేవుని ప్రజల జీవితములలో కేంద్ర స్థానమును పొందుకొనినందున, దేవుని తీర్పులో దావీదు సింహాసనమును విడిచిపెట్టుట జరుగుతుంది. ఉదాహరణకు, యెషయా 39:5-7లో యెషయా రాజైన హిజ్కియాను ఖండించినప్పుడు దావీదు సింహాసనముకు వ్యతిరేకముగా వచ్చు తీర్పును గూర్చి మనము చదువుతాము.

> అంతట యెషయా హిజ్కియాతో నిట్లనెను, యెహోవా సెలవిచ్చుమాట వినుము రాబోవు దినములలో ఏమియు మిగులకుండ నీ యింటనున్న సమస్తమును, నేటివరకు నీ పితరులు సమ కూర్చి దాచిపెట్టినది అంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొని పోవుదురని సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. మరియు నీ గర్భమందు పుట్టిన నీ పుత్రసంతును బబులోను రాజు నగరునందు నపుంసకులగా చేయుటకై వారు తీసికొనిపోవుదురు (యెషయా 39:5-7).

దావీదు సింహాసనము విడువబడుట అనునది దేవుని ప్రజల చరిత్రకు ముగింపు పలికిన చెరలో ఒక భాగమై ఉంది.

దావీదు సింహాసనమునకు విరోధముగా తీర్పు అను విషాదం ఉన్నప్పటికీ, దేవుడు దావీదు సింహాసనమును విడిచిపెట్టుటతో సమస్తమును ముగించలేదు అని ప్రవక్తలు ఇశ్రాయేలుకు ధృవీకరించారు. బదులుగా, చెర తరువాత ఇశ్రాయేలు యొక్క పునరుద్ధరణలో దావీదు సింహాసనము మహా మహిమకు పునరుద్ధరణ చెందడం కూడా జరుగుతుంది. యిర్మీయా 23:5-6లో దావీదు సింహాసనము యొక్క పునరుద్ధరణను గూర్చి యిర్మీయా ఎలా వివరించాడో వినండి:

> యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు రాబోవు దినములలో నేను దావీదునకు నీతి చిగురును పుట్టించెదను; అతడు రాజై పరిపాలన చేయును, అతడు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును, భూమిమీద నీతి న్యాయములను జరిగించును. అతని దినములలో యూదా రక్షణనొందును, ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును, యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు (యిర్మీయా 23:5-6).

దావీదుకు నీతి జరిగించు కుమారుని అనుగ్రహిస్తాననిన వాగ్దానము, పునరుద్ధరణ యొక్క అంత్యదినములను గూర్చిన చిత్రపటములో ముఖ్యమైన అంశముగా మారింది.

ఆరంభ ప్రవక్తలు దావీదు సింహాసనమును గూర్చి మాత్రమే వివరించలేదుగాని, దావీదు కుమారుడైన సొలొమోను నిర్మించిన దేవాలయము మీద కూడా దృష్టిపెట్టారు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## దేవాలయము

యెరూషలేములో ఉన్న దేవాలయము నాశనము కానేరనిది అని అనేకమంది ఇశ్రాయేలీయులు తప్పుగా అర్థం చేసుకున్నారు. యెరూషలేములోని దేవాలయము యొక్క నాశనమును గూర్చి ప్రవక్తలు ధైర్యంగా మాట్లాడవలసి వచ్చింది. ఉదాహరణకు, యెరూషలేము ఎప్పటికీ నాశనము చేయబడదు అని దృఢముగా చెప్పుచున్న అబద్ధ ప్రవక్తలు మరియు యాజకులకు వ్యతిరేకముగా యిర్మీయా గట్టిగా మాట్లాడాడు. యిర్మీయా 7లో, ఈ అబద్ధ బోధను నమ్మవద్దని ప్రవక్త ప్రజలను హెచ్చరించాడు. 4వ వచనములో, మనము ఈ మాటలు చదువుతాము:

> ఈ స్థలము యెహోవా ఆలయము, ఈ స్థలము యెహోవా ఆలయము, ఈ స్థలము యెహోవా ఆలయము అని మీరు చెప్పుకొనుచున్నారే; యీ మోసకరమైన మాటలు ఆధారము చేసికొనకుడి (యిర్మీయా 7:4).

చెర సమయములో దేవాలయము నాశనము చేయబడుతుంది అని యెహోవా యొక్క నిజమైన ప్రవక్తలు ఏకరీతిగా ప్రకటించారు.

చెర తరువాత జరుగు పునరుద్ధరణ సమయంలో మహిమకరమైన దేవాలయము పునర్నిర్మించబడుతుంది అని కూడా ప్రవక్తలు వాగ్దానం చేశారు. పునరుద్ధరణ కాలములో జరుగు ఈ మహిమకరమైన దేవాలయము యొక్క పునర్నిర్మాణమును గూర్చి ఇతర ప్రవక్తల కంటే ఎక్కువగా యెహెజ్కేలు మాట్లాడాడు. అతని గ్రంథములోని 40-48 అధ్యాయములు ఈ అంశము మీద దృష్టిపెడతాయి. పునర్నిర్మించవలసిన దేవాలయము యొక్క ప్రత్యేకమైన చిత్రమును దేవుడు యెహెజ్కేలుకు ఇచ్చాడు మరియు దానిని నిర్మించుమని ప్రజలకు ఆజ్ఞాపించాడు. యెహెజ్కేలు 43:10-11లో దేవుడు యెహెజ్కేలుతో పలికిన మాటలను వినండి:

> కాబట్టి నరపుత్రుడా, ఇశ్రాయేలీయులు తాము చేసిన దోషములనుబట్టి సిగ్గుపడునట్లు ఈ మందిరమును వారికి చూపించుము, వారు దాని పైఖరిని కనిపెట్టవలెను. తాము చేసినవాటన్నిటినిబట్టి వారు సిగ్గుపడినయెడల, మందిరముయొక్క పైఖరిని దాని యేర్పాటును … వారికి కనుపరచి, వారు ఆ ఆచార విధులన్నిటిని గైకొని ఆచరించునట్లు వారు చూచుచుండగా వాటిని వ్రాయించుము (యెహెజ్కేలు 43:10-11).

ఆరంభ ప్రవక్తలు దావీదు సింహాసనము మరియు దేవాలయము గూర్చి అదనముగా చేర్చారు. అయితే వారు మోషే సరిగా చర్చించని మూడవ విషయమును కూడా చేర్చారు – వారు అన్యరాజ్యముల మీద దృష్టిపెట్టారు.

## అన్యజనులు

మొదటిగా, ఇశ్రాయేలు యొక్క చెర దేవుని ప్రజల మీద కొన్ని అన్యరాజ్యములకు విజయము అని ప్రవక్తలు చాలా స్పష్టంగా చెప్పారు. మనకు తెలిసినట్లుగా, అష్షూరీయులు మరియు బబులోనీయులు ఇశ్రాయేలును ఓడించి మరియు దేవుని ప్రజలను అవమానపరచారు.

ఇశ్రాయేలు చెర సమయంలో అన్యరాజ్యములకు విజయము లభించినప్పటికీ, ఈ అన్యరాజ్యముల ఆధిపత్యం శాశ్వతకాలం ఉండదని ఆరంభ ప్రవక్తలు ప్రకటించారు. చెర నుండి పునరుద్ధరణ జరిగినప్పుడు, పునరుద్ధరించబడిన దావీదు సింహాసనము ద్వారా, ఆయన ప్రజలను అవమానపరచిన అన్యరాజ్యములను దేవుడు కొట్టివేస్తాడు. దేవుడు అన్యజనులను ఓడించి, అన్యజనులతో జరుగు యుద్ధములో ఇశ్రాయేలుకు గొప్ప విజయము అనుగ్రహిస్తాడు. ఈ అంశము ప్రవచన గ్రంథములన్నిటిలో అనేక విధాలుగా కనిపిస్తుంది, అయితే ముందుగా కనిపించే అత్యంత నాటకీయమైన విధానము "యెహోవా దినము" హెబ్రీలో *యోమ్ యహ్వే* అను సాంకేతిక వ్యక్తీకరణములో కనిపిస్తుంది. ఈ పదసమూహము వెనుక ఉన్న ప్రాథమిక ఆలోచన ఏమిటంటే యెహోవా తన శత్రువులందరినీ ఒకే దినమందు నాశనము చేయగలడు, మరియు ఈ కారణమును బట్టి, విజయవంతమైన సైనికులు యుద్ధములోకి వెళ్లినప్పుడు, "ఇది మా దినము" అని చెప్పినట్లుగానే, "యెహోవా దినము" అనునది ఆయనకు చెందినదిగా చెప్పబడింది.

ఈ పదము ఇశ్రాయేలు యొక్క చెర మరియు ఇశ్రాయేలు యొక్క పునరుద్ధరణ మధ్య వ్యత్యాసమును నిర్దేశించే విధానంలో ప్రత్యేకముగా శక్తివంతమైనదిగా ఉంది. ప్రవక్తయైన యోవేలు "యెహోవా దినము" అను వ్యక్తీకరణమును ఉపయోగించిన విధానమును చూచుట బహుశా దీనిని చూడగల ఉత్తమమైన మార్గము. యోవేలు 1:15, 2:1, 2:11, 2:31, మరియు 3:14లో ఈ వ్యక్తీకరణము కనిపిస్తుంది. "యెహోవా దినము"ను గూర్చిన మొదటి మూడు రిఫరెన్సులు దేవుడు యూదా రాజ్యమును ఓడించుటను సూచిస్తాయి. నిబంధనా ప్రజలు తమ పాపముల వలన దేవుని శత్రువులుగా మారారు, మరియు "యెహోవా దినము" ఆయన వారిని నాశనము చేసి చెరకు పంపించు సమయముగా ఉంది.

అయితే యోవేలు తన గ్రంథము యొక్క రెండవ భాగంలో ఈ పదమును ఉపయోగించు విధానమును కూడా మార్చాడు. అతడు మరొక సంఘటనను "యెహోవా దినము"గా వివరించాడు. ఇశ్రాయేలు చెర నుండి తిరిగి వచ్చినప్పుడు ఈ "యెహోవా దినము" వస్తుంది. ఇది దేవుని ప్రజలను హింసించిన రాజ్యముల యొక్క ఓటమి అవుతుంది. ఉదాహరణకు, యోవేలు 2:31-32లో మనము ఈ మాటలు చదువుతాము:

> **యెహోవా యొక్క భయంకరమైన ఆ మహాదినము రాకముందు సూర్యుడు తేజోహీనుడగును, చంద్రుడు రక్తవర్ణమగును. యెహోవా సెలవిచ్చినట్లు సీయోను కొండమీదను యెరూషలేములోను తప్పించుకొనినవారుందురు, శేషించినవారిలో యెహోవా పిలుచువారు కనబడుదురు. ఆ దినమున యెహోవా నామమునుబట్టి ఆయనకు ప్రార్థనచేయు వారందరును రక్షింపబడుదురు (యోవేలు 2:31-32).**

కాబట్టి యోవేలు దృష్టిలో "యెహోవా దినము" దేవుని ప్రజలకు వ్యతిరేకముగా వచ్చు తీర్పును సూచించడమే కాకుండా, దేవుని ప్రజలు వాగ్దాన 9భూమికి తిరిగి వచ్చునప్పుడు జరిగే గొప్ప యుద్ధమును కూడా సూచిస్తుంది అని మనం చూస్తాము.

ఇశ్రాయేలు యొక్క యుగాంతశాస్త్రములో అన్యులు అను అంశమును మనము విడిచిపెట్టే ముందు, మనము ఒక చివరి విషయము చూడాలి – అన్యజనులు అంట్టుకట్టబడట ద్వారా ఇశ్రాయేలు యొక్క విస్తరణ. ఇశ్రాయేలు పునరుద్ధరించబడినప్పుడు "యెహోవా దినము" అన్యజనులకు వ్యతిరేకంగా



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్మ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

వచ్చినప్పుడు, అన్యజనులందరూ నాశనము చేయబడరు. దీనికి భిన్నంగా, యుద్ధము తరువాత, చాలామంది అన్యజనులు దేవుని ప్రజల యొద్దకు వచ్చి, వారితో కలసి నిజమైన మరియు సజీవమైన దేవునిని ఆరాధిస్తారు. యెషయా 2:2-3లో ప్రవక్తయైన యెషయా చెప్పినట్లుగా:

> అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వత మునకు మనము వెళ్లుదము రండి ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు (యెషయా 2:2-3).

ఇవి మరియు అనేక ఇతర వాక్యభాగములు పాత నిబంధన ప్రవచన గ్రంథములలోని యుగాంతశాస్త్ర నిరీక్షణల యొక్క ముగింపును సూచిస్తాయి. దేవుని ఆశీర్వదములు ఇశ్రాయేలు మీద కుమ్మరించబడతాయి, అయితే ఈ ఆశీర్వాదములలో అనేకమంది అన్యజనులు నిజమైన విశ్వాసములోకి చేర్చబడుట జరుగుతుంది, తద్వారా దేవుని నిబంధనా జనులు భూమియందంతటను నింపునంతగా విస్తరిస్తారు. ఈ గొప్ప క్రొత్త ఆకాశములు మరియు క్రొత్త భూమి దేవుని జ్ఞానముతో నింపబడిన ప్రపంచముగా ఉంటుంది. భూమి మీదకు సమాధానం వస్తుంది మరియు మిగిలిన ప్రజలంతా నిజమైన సజీవ దేవునిని ఆరాధిస్తారు.

కాబట్టి ఆరంభ ప్రవక్తలు మోషే నియమించిన ప్రాథమిక నమూనాను అనుసరించడం మనం చూస్తాము. చెర జరుగుతుందని వారు నమ్మారు, అయితే పశ్చాత్తాపము మరియు క్షమాపణ ఎస్కటాన్, లేదా గొప్ప పునరుద్ధరణలోకి నడిపిస్తుంది. ఇప్పుడు, ఈ ప్రాథమిక నమూనాకు ఆరంభ ప్రవక్తలు అనేకమైన ముఖ్య అంశములను అదనముగా చేర్చారు: మొదటిగా, దావీదు సింహాసనము యొక్క కేంద్రీకృతము; రెండవదిగా, దేవాలయము యొక్క ప్రాముఖ్యత; మరియు మూడవదిగా, ఇశ్రాయేలు చెరలో మరియు దేవుని ప్రజల యొక్క పునరుద్ధరణలో అన్యజనులు పోషించే ముఖ్యమైన పాత్ర.

మోషే యుగాంతశాస్త్రము యొక్క పునాదిని మరియు ఆరంభ ప్రవక్తల యుగాంతశాస్త్రము యొక్క సారూప్యతలు మరియు అదనముగా చేర్చబడిన విషయాలను మనం చూశాము. ఇప్పుడు తరువాత ప్రవక్తల యుగాంతశాస్త్రపు పురోభివృద్ధిని వివరించే స్థితిలో మనం ఉన్నాము.

## తరువాత ప్రవక్తల యుగాంతశాస్త్రము

ఇతర పాఠములలో, చారిత్రిక అనిశ్చితముల జోక్యము దేవుడు తన ప్రవక్తల యొక్క ప్రవచనములను జరిగించు విధానము మీద ముఖ్యమైన ప్రభావమును చూపిస్తుంది అని మనము చూశాము. సరే, అనేక సందర్భములలో, పాత నిబంధనలో జరుగు అత్యంత గొప్ప చారిత్రిక అనిశ్చితముల యొక్క జోక్యమును తరువాత ప్రవక్తలలో మనం చూస్తాము. దేవుని ప్రజల యొక్క



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

ప్రతిచర్యలు అంత్యదినములు, లేదా ఎస్కటాన్ విపృతము చేయు మార్గముల మీద విపరీతమైన ప్రభావమును చూపించాయని మనం చూస్తాము.

ఈ విషయమును మనం పరిశీలించుచుండగా, మూడు అంశములను మనం చూద్దాము: మొదటిగా, యిర్మీయా ప్రవచనములు; రెండవదిగా, దానియేలు యొక్క అంతర్దృష్టి; మరియు చివరిగా, పాత నిబంధన ప్రవచన గ్రంథముల యొక్క చివరి దృక్పథములు. మొదటిగా, ఇశ్రాయేలు పునరుద్ధరణను గూర్చి యిర్మీయా ఇచ్చిన ప్రవచనమును చూద్దాము.

## యిర్మీయా ప్రవచనము

అనేక సందర్భములలో, యిర్మీయా ఆరంభ బైబిలు ప్రవచనమును అనుసరించాడు. అయితే, రెండు వాక్యభాగములలో, ఇంతకు ముందు లేని విషయమును యిర్మీయా చేర్చాడు. చెర కాలము డెబ్బది సంవత్సరములు అని అతడు ప్రవచించాడు. 25:11-12లో మనము ఈ మాటలను చదువుతాము:

> **ఈ దేశమంతయు పాడుగాను నిర్జనముగాను ఉండును; ఈ జనులు డెబ్బది సంవత్సరములు బబులోను రాజునకు దాసులుగా ఉందురు. డెబ్బది సంవత్సరములు గడచిన తరువాత బబులోను రాజును ఆ జనులను కల్దీయుల దేశమును శిక్షింతును (యిర్మీయా 25:11-12).**

అదే విధంగా, యిర్మీయా 29:10-11లో యిర్మీయా ఇలా చెప్పాడు:

> **బబులోను రాజ్యమునకు డెబ్బది సంవత్సరములు గతించిన తరువాతనే మిమ్మునుగూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి యీ స్థలమునకు మిమ్మును తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును. నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 29:10-11).**

కాబట్టి డెబ్బది సంవత్సరములలో చెర ముగుస్తుందని యిర్మీయా ప్రవచించినట్లు మనం చూస్తాము.

వాస్తవంగా చెప్పాలంటే, 2 దినవృత్తాంతములు 36:21-22 ప్రకారం, క్రీ.పూ. 539లో, జెరుబ్బాబెలు నాయకత్వంలో మొదటిగా వచ్చినవారు భూమికి చేరుకున్నప్పుడు ఈ ప్రవచనము నెరవేర్చబడింది. జెకర్యా 1:12 మరియు జెకర్యా 7:5లో జెకర్యా కూడా ఈ సమయమును ధృవీకరించాడు. కాబట్టి చెర డెబ్బది సంవత్సరములు ఉంటుందని యిర్మీయా ప్రవచించినట్లు మనం చూస్తాము, మరియు కొన్ని సందర్భములలో అలానే జరిగింది. 539లో, పారసీక రాజగు కోరేషు, ఇశ్రాయేలీయులు తిరిగి తమ భూమికి వెళ్లి తమ దేవాలయమును పునర్నిర్మించుకోవాలని ప్రకటించాడు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

డెబ్బది సంవత్సరములను గూర్చిన యిర్మీయా ప్రవచనమును దృష్టిలో ఉంచుకొని, యుగాంతశాస్త్రమును గూర్చిన దానియేలు యొక్క అంతర్దృష్టిని అర్థం చేసుకొనుటకు మనం సిద్ధంగా ఉన్నాము.

## దానియేలు అంతర్దృష్టి

ప్రవచనములో దానియేలు చేర్చిన ముఖ్యమైన విషయం ఏమిటంటే దానియేలు 9లో సంవత్సరముల యొక్క డెబ్బది వారములను గూర్చి సుప్రసిద్ధ దర్శనము. ఈ వాక్యభాగము సుమారు 539వ సంవత్సరములో ఇశ్రాయేలీయులు తమ వాగ్దాన భూమికి తిరిగి వెళ్లాలని కోరేషు తన శాసనమును విధించినప్పుడు దానియేలు పొందుకున్న అంతర్దృష్టి యొక్క ఆత్మకథగా ఉంది.

దానియేలు 9, 1-3 వచనములలోని పరిచయముతో ఆరంభమౌతుంది. అక్కడ, డెబ్బది సంవత్సరముల చెరను గూర్చిన యిర్మీయా ప్రవచనమును చదువుతున్నానని దానియేలు నివేదించాడు. 2వ వచనములో, మనము ఈ మాటలు చదువుతాము:

> అతని ఏలుబడిలో మొదటి సంవత్సరమందు దానియేలను నేను యెహోవా తన ప్రవక్తయగు యిర్మీయాకు సెలవిచ్చి తెలియజేసినట్టు, యెరూషలేము పాడుగా ఉండవలసిన డెబ్బది సంవత్సరములు సంపూర్తియౌచున్నవని గ్రంథములవలన గ్రహించితిని.

ఇప్పుడు, చెర కేవలము డెబ్బది సంవత్సరములు మాత్రమే ఉంటుందని యిర్మీయా చెప్పినట్లు దానియేలుకు తెలుసు, అయితే ఆనందించుటకు బదులుగా, మన ఆలోచనకు భిన్నంగా దానియేలు చేశాడని 3వ వచనము చెబుతుంది:

> అంతట నేను గోనెపట్ట కట్టుకొని, ధూళి తలపైన వేసికొని ఉపవాసముండి, ప్రార్థన విజ్ఞాపనలు చేయుటకై ప్రభువగు దేవుని యెదుట నా మనస్సును నిబ్బరము చేసికొంటిని (దానియేలు 9:3).

యిర్మీయా చెప్పిన డెబ్బది సంవత్సరములు ముగిసినందుకు దానియేలు సంతోషంగా ఉండాలని మనం ఆశించిననూ, బదులుగా అతడు గోనెపట్ట కట్టుకొని, ధూళి వేసికొని దేవుని అనుగ్రహమును కోరాడు.

4-19 వచనములలో, దానియేలు ప్రార్థన యొక్క సారాంశమును మనం చూస్తాము. ఈ ప్రార్థనలో, అతడు అతి తీవ్రమైన సమస్యను గూర్చి విజ్ఞాపన చేశాడు. యిర్మీయా ప్రవచించిన డెబ్బది సంవత్సరములు ముగిసాయి, కాని ప్రజలు తమ పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడలేదు. 13 మరియు 14 వచనములలో అతడు చెప్పినట్లుగా:

> కీడంతయు మాకు సంభవించినను మేము మా చెడునడవడి మానకపోతిమి; నీ సత్యమును అనుసరించి బుద్ధి తెచ్చుకొనునట్లు మా దేవుడైన యెహోవాను సమాధానపరచుకొనకపోతిమి ... మేము మా దేవుడైన యెహోవా మాట వినలేదు (దానియేలు 9:13-14).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

ఇప్పటికే ఈ పాఠంలో మనము చూసిన దానిని దానియేలు అర్థం చేసుకున్నాడు. దేవుని ప్రజలు తమ పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడితేనే చెర తలక్రిందులు చేయబడుతుంది అని మోషే ప్రకటించాడు, అయితే ఇక్కడ ఊహించని విధంగా జోక్యం చేసుకున్న చారిత్రిక అనిశ్చితము ఉంది. ఇశ్రాయేలీయులు చెరలోకి వెళ్లారు, అయితే వారింకను తమ పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడలేదు, గనుక, ఎస్కటాన్ ను వివృతము చేయు విధానములో గణనీయమైన మార్పులు జరిగాయి.

దానియేలు తన ప్రార్థనను దయ చూపించుము అను విన్నపముతో ముగించాడు. ప్రజలు తమ తిరుగుబాటు నిమిత్తము పశ్చాత్తాపపడనందున, ఆయన మహిమపరచబడుటకు ప్రజల యొద్దకు తిరిగి రమ్మని దానియేలు దేవునిని బ్రతిమాలుకున్నాడు. 17 మరియు 18 వచనములలో మనము ఇలా చదువుతాము:

> ప్రభువు చిత్తానుసారముగా శిథిలమై పోయిన నీ పరిశుద్ధ స్థలముమీదికి నీ ముఖప్రకాశము రానిమ్ము. నీ గొప్ప కనికరములనుబట్టియే మేము నిన్ను ప్రార్థించుచున్నాము గాని మా స్వనీతికార్యములనుబట్టి నీ సన్నిధిని నిలువబడి ప్రార్థించుటలేదు. మా దేవా, చెవి యొగ్గి ఆలకింపుము; నీ కన్నులు తెరచి, నీ పేరుపెట్టబడిన యీ పట్టణముమీదికి వచ్చిన నాశనమును, నీ పేరు పెట్టబడిన యీ పట్టణమును దృష్టించి చూడుము (దానియేలు 9:17-18).

వారు తమ పాపముల నిమిత్తము పశ్చాత్తాపము పొందనప్పటికీ కూడా, దేవుడు తన ప్రజలను పునరుద్ధరిస్తాడని అతడు బహుగా నిరీక్షించాడు.

దానియేలు 9:20-27 యొక్క మిగిలిన భాగము దానియేలు ప్రార్థనకు దేవుని ప్రతిస్పందనను కలిగి ఉంది. గబ్రియేలను మనుష్యుడు ఒక సందేశముతో దేవుని యొద్ద నుండి వస్తున్నాడు. 9:24లో దీనిని అతడు దానియేలుకు చెప్పాడు:

> తిరుగుబాటును మాన్పుటకును, పాపమును నివారణ చేయుటకును, దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకును, యుగాంతము వరకుండునట్టి నీతిని బయలుపరచుటకును, దర్శనమును ప్రవచనమును ముద్రించుటకును, అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకును, నీ జనమునకును పరిశుద్ధ పట్టణమునకును డెబ్బదివారములు విధింపబడెను (దానియేలు 9:24).

సులభంగా చెప్పాలంటే, చెర డెబ్బది సంవత్సరముల నుండి, యిర్మీయా ప్రకారము, డెబ్బది వారములు లేదా సుమారు 490 సంవత్సరముల వరకు వ్యాపించబడింది. ప్రజలు పశ్చాత్తాపపడుటకు నిరాకరించినందున, దేవుడు చెర యొక్క కాలమును ఏడు రెట్లు పెంచాలని నిర్ణయించుకున్నాడు. లేవీయకాండము 26:18లో దేవుడు చెప్పినట్లుగా:

> ఇవన్నియు సంభవించినను మీరింక నా మాటలు విననియెడల నేను మీ పాపములను బట్టి మరి ఏడంతలుగా మిమ్మును దండించెదను (లేవీయకాండము 26:18).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

దేవుడు ఇశ్రాయేలు పునరుద్ధరణను ఆలస్యం చేశాడు, మరియు వాగ్దాన భూమి మీద నియంత్రణ ఒక అన్యరాజ్యము నుండి మరొకదానికి, ఆ రాజ్యము నుండి ఇంకొక రాజ్యముకు, దేవుని రాజ్యము క్రీస్తునందు వచ్చేవరకు ఇవ్వబడుతూ ఉంది.

డెబ్బది సంవత్సరముల చెర కాలమును గూర్చిన యిర్మీయా ప్రవచనమును మరియు అది ఏడింతలుగా, 490 సంవత్సరములు వరకు పెంచబడుతుంది అను ఆలోచనను ఇప్పటివరకు మనం చూశాము గనుక, పాత నిబంధన ప్రవచనాత్మక యుగాంతశాస్త్రము యొక్క చివరి దశలను చూచుటకు సిద్ధంగా ఉన్నాము.

## అంతిమ దృక్పథములు

పాత నిబంధన ప్రవచనము యొక్క అంతిమ దశలు అనేకమంది ఇశ్రాయేలీయులు చెర నుండి వాగ్దానభూమికి తిరిగి వచ్చిన తరువాత పునరుద్ధరణ కాలములో జరిగాయి. పాత నిబంధన యుగాంతశాస్త్రము ఈ అంతిమ దశలో ఏ విధముగా ఉన్నదో అర్థం చేసుకోవాలంటే, మనము రెండు విషయాలను చూడాలి: మొదటిగా, ఆరంభ పునరుద్ధరణ నిరీక్షణలు; మరియు రెండవదిగా, తరువాత పునరుద్ధరణ నిరీక్షణలు. ఇశ్రాయేలీయులలో మొదటి గుంపు బబులోను చెర నుండి వాగ్దాన భూమికి తిరిగి వచ్చిన తరువాత ఆరంభ సంవత్సరములలో పరిచర్య చేసిన ప్రవక్తల యొక్క ఆరంభ నిరీక్షణలను మొదటిగా చూద్దాము.

### ఆరంభ నిరీక్షణలు

ఈ సమయములో, క్రీ.పూ. 539 నుండి 515 వరకు గల ఆరంభ కాలము మీద మనము దృష్టిపెడదాము. ఈ కాలములో, పునరుద్ధరించబడిన దేవుని ప్రజల మీద దేవుని గొప్ప ఆశీర్వాదములు కుమ్మరించబడుతున్నాయి అని నిరీక్షణతో చూచుటకు ఇశ్రాయేలీయులు చిన్న సమూహములుగా భూమికి తిరిగి వచ్చారు. అనేక సందర్భములలో, వారు పశ్చాత్తాపపడుట మరియు ప్రభువును నమ్మకముగా సేవించుట ద్వారా పొడిగించబడిన దానియేలు యొక్క 490 సంవత్సరములు కుదించబడాలని ఆశించారు. హగ్గయి మరియు జెకర్యా నాలుగు యుగాంతశాస్త్ర నిరీక్షణల మీద దృష్టిపెట్టారు: దావీదు సింహాసనము యొక్క పునరుద్ధరణ, అన్యరాజ్యముల మీద విజయము, దేవాలయము యొక్క పునరుద్ధరణ, మరియు ప్రకృతి యొక్క పునరుద్ధరణ. దేవుని ప్రజల విషయములో హగ్గయి మరియు జెకర్యా గొప్ప నిరీక్షణలు కలిగి ఉన్నారు. ఈ సమయములో దేవుని ప్రజల యొక్క నమ్మకత్వము పునరుద్ధరించబడిన రాజ్యముకు అనేక ఆశీర్వాదములను తెస్తుంది అని వారు నిరీక్షించారు.

ఇశ్రాయేలు భూమికి తిరిగి వచ్చిన ఆరంభ సంవత్సరములలో జెరుబ్బాబెలు మరియు దేవాలయము యెడల వారు కలిగియున్న నిరీక్షణలు ఉన్నతమైనవిగా ఉన్నప్పటికీ, ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగలేదు. బదులుగా, తరువాత పునరుద్ధరణ కాలము యొక్క నిరీక్షణలు మరొక మలుపును తీసుకోవడం మనం గమనిస్తాము. హగ్గయి మరియు జెకర్యా హెచ్చరించినట్లుగా జెరుబ్బాబెలు దేవాలయమును పూర్తి చేశాడు, అయితే జెకర్యా గ్రంథము యొక్క రెండవ భాగము, ఎజ్రా, నెహెమ్యా మరియు మలాకీ నుండి మనం నేర్చుకున్నట్లుగా, ఇశ్రాయేలు ప్రజలు దేవుని చిత్తానికి బాహ్య

సమర్పణ మాత్రమే కలిగి ఉన్నారు. ఒక తరములో, అన్య స్త్రీలతో విస్తృతముగా వివాహములు జరిగాయి కాబట్టి విస్తృతమైన మతభ్రష్టత్వం జరిగింది. ఫలితంగా, ఆరంభ చెర తరువాత కాలములో ఇశ్రాయేలుకు గొప్ప ఆశీర్వాదములు కలుగుతాయను నిరీక్షణలు సుదూర భవిష్యత్తుకు కేటాయించబడ్డాయి.

## అంతిమ నిరీక్షణలు

ఇతర ప్రవక్తల కంటే ఎక్కువగా మలాకీ ఈ సుదూర నిరీక్షణ మీద దృష్టి పెట్టాడు. యెరూషలేములో నివసించే వారిని ఆయన సూటిగా ఖండించాడు మరియు తీర్పు మరియు ఆశీర్వాద దినము భవిష్యత్తులో రాబోవుచున్నదని వారిని హెచ్చరించాడు. ఉదాహరణకు, మలాకీ 3:1లో మనము ఈ మాటలు చదువుతాము:

> ఇదిగో నాకు ముందుగా మార్గము సిద్ధపరచుటకై నేను నా దూతను పంపుచున్నాను; మీరు వెదకుచున్న ప్రభువు, అనగా మీరు కోరు నిబంధన దూత, తన ఆలయమునకు హఠాత్తుగా వచ్చును; ఇదిగో ఆయన వచ్చుచున్నాడని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు (మలాకీ 3:1).

4:1-2లోని అతని చివరి మాటలలో, ఆ గొప్ప భవిష్యత్తు దినమందు ఏమి జరుగుతుందో మలాకీ మాట్లాడాడు:

> ఏలయనగా నియమింపబడిన దినము వచ్చుచున్నది, కొలిమి కాలునట్లు అది కాలును; గర్విష్ఠులందరును దుర్మార్గులందరును కొయ్యకాలువలె ఉందురు, వారిలో ఒకనికి వేరైనను చిగురైనను లేకుండ, రాబోవు దినము అందరిని కాల్చివేయునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. అయితే నా నామమందు భయభక్తులుగలవారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును; అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీరు బయలుదేరి క్రొవ్విన దూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు (మలాకీ 4:1-2).

పాత నిబంధన ముగించబడినప్పుడు, ఈ రక్షణ తక్షణమే వచ్చుట లేదు అని స్పష్టం అవుతుంది. దేవుని ప్రజలు పరిపూర్ణ పునరుద్ధరణ కొరకు వేచియుండాలి.

పాత నిబంధన గ్రంథములోని యుగాంతశాస్త్రము మోషేతో ఆరంభమైనదని, మరియు ఆరంభ ప్రవక్తలు రాజత్వము మరియు దేవాలయము అను అంశములను చేర్చుట ద్వారా ఈ విషయముల మీద అనేకమైన అంతర్దృష్టులను అందించారని మనం చూశాము. ఇప్పుడు, పాత నిబంధన గ్రంథములోని దానియేలు మరియు తరువాత ప్రవక్తలు చెర కాలము మరింత పెరుగుతుందని నేర్చుకున్నట్లుగా మనం చూశాము. అప్పుడే గొప్ప దైవిక జోక్యము జరుగుతుంది మరియు దేవుని ప్రజలకు పునరుద్ధరణ తెస్తుంది. ఇది మనలను బైబిలు యుగాంతశాస్త్రము యొక్క చివరి దశకు తీసుకువస్తుంది, క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము.

# క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము

క్రైస్తవులముగా పాత నిబంధన ప్రవచనమును చదువునప్పుడెల్లా, క్రొత్త నిబంధన రచయితల యొక్క దృక్పథములను మనము అనుసరించాలి. క్రొత్త నిబంధన రచయితలు పాత నిబంధనలోని యుగాంతశాస్త్రము యొక్క పురోభివృద్ధిని అర్థం చేసుకున్నారు, అయితే వారు దీనికి యేసు పరిచర్య యొక్క వాస్తవికతను జోడించారు. యేసు ఈ లోకమునకు వచ్చి యుగాంతశాస్త్రము వివృతమగుచున్న విధానములో మార్పును కలిగించాడు, మరియు క్రైస్తవులంగా, క్రొత్త నిబంధనలో మనకు ఇవ్వబడిన ఈ దృక్పథమును మనము అనుసరించాలి. మూడు విషయాలను పరిశీలిస్తున్నప్పుడు యుగాంతశాస్త్రము యొక్క క్రొత్త నిబంధన చిత్రమును మనం గ్రహించవచ్చు: మొదటిగా, క్రొత్త నిబంధనలోని కొన్ని ముఖ్యమైన పదాలు; రెండవదిగా, క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము యొక్క ప్రాథమిక నిర్మాణము; మరియు మూడవదిగా, క్రొత్త నిబంధనలో కనిపించే ప్రధానమైన యుగాంతశాస్త్ర అంశాలు. క్రొత్త నిబంధనలోని అనేక ముఖ్యమైన పదాలను మొదటిగా చూద్దాము, అవి అంత్యదినములను గూర్చిన క్రొత్త నిబంధన దృక్పథాల యెడల మనకొక ధోరణిని ఇస్తాయి.

## పదములు

ప్రత్యేకముగా మూడు ముఖ్యమైన వ్యక్తీకరణముల మీద మనం దృష్టి పెడదాము: మొదటిగా, "సువార్త" అను పదము; తరువాత, "రాజ్యము" అను పదము; మరియు చివరిగా, "అంత్యదినములు" అను వ్యక్తీకరణము.

### సువార్త

"సువార్త" అను పదము ప్రతి విశ్వాసికి సుపరిచితమైన పదము. ఇది గ్రీకు పదమైన *యువాంగెలియోన్* నుండి వస్తుంది, అనగా "శుభవార్త" అని అర్థం. పదే పదే, యేసు మరియు అపొస్తలులు "సువార్త" లేదా "శుభవార్త" ప్రకటించారని క్రొత్త నిబంధన చెబుతుంది. క్రొత్త నిబంధన రచయితలు క్రీస్తును గూర్చిన క్రైస్తవ సందేశమును సువార్త లేదా శుభవార్త అని వందసార్లు కంటే ఎక్కువగా మాట్లాడారు. క్రొత్త నిబంధన "సువార్త" అను పదమును క్రొత్తగా రూపొందించలేదని గ్రహించడం చాలా ముఖ్యమైన విషయం. బదులుగా, క్రొత్త నిబంధన రచయితలు "సువార్త" అను పదమును పాత నిబంధన ప్రవక్తల నుండి పొందుకున్నారు.

పాత నిబంధన ప్రవక్తలు హెబ్రీ పదమైన *బసర్* (בָּשַׂר) ను ఉపయోగించారు, దీనిని తరచుగా "శుభవార్త" లేదా "ఆనందభరితమైన వార్త" అని అనేక సందర్భములలో అనువదిస్తారు. వారి మనసులో ఎటువంటి సువార్త ఉంది? సరే, ఒక మాటలో చెప్పాలంటే, ప్రవక్తలు ప్రకటించిన శుభవార్త ఏమనగా చెర ముగిసింది మరియు దేవుని ప్రజల యొక్క పునరుద్ధరణ జరుగబోతుంది అను శుభవార్త. ఉదాహరణకు, యెషయా 52:5-7లో ప్రవక్తయైన యెషయా మాట్లాడిన విధమును వినండి: 5 మరియు 6 వచనములలో మనము ఈ మాటలు చదువుతాము:

> నా జనులు ఊరకయే కొనిపోబడియున్నారు వారిని బాధపరచువారు వారిని చూచి గర్జించుచున్నారు ... నా జనులు నా నామము తెలిసికొందురు నేనున్నానని చెప్పువాడను నేనే అని వారు ఆ దినమున తెలిసికొందురు (యెషయా 52:5-6).

ఆయన ప్రజలు తన శక్తి యొక్క గొప్ప ప్రదర్శనను చూస్తారని దేవుడు ప్రకటించాడు, మరియు చెర నుండి పునరుద్ధరణను గూర్చి ఆయన చెప్పాడని వారికి తెలుస్తుంది. కాబట్టి, పునరుద్ధరణ యొక్క ఈ ధృవీకరణను ప్రతిబింబిస్తూ, 7వ వచనములో యెషయా ఇలా చెప్పాడు:

> సువార్త ప్రకటించుచు సమాధానము చాటించుచు సువర్తమానము ప్రకటించుచు రక్షణ సమాచారము ప్రచురించువాని పాదములు, "నీ దేవుడు ఏలుచున్నాడని" సీయోనుతో చెప్పుచున్న వాని పాదములు పర్వతముల మీద ఎంతో సుందరములై యున్నవి (యెషయా 52:7).

కొంతమంది దూతల యొక్క రూపము చూచుటకు ఖచ్చితంగా అందముగా ఉంటుందని యెషయా ప్రకటించాడు. ఎటువంటి దూతలు? సువర్తమానము లేదా "సువార్త" ప్రకటించువారు.

ఇప్పుడు, "సువార్త" అను పదముకు ఈ ప్రవచనాత్మక నేపథ్యము యేసు మరియు ఆయన అపొస్తలులు క్రీస్తు సువార్తను ఎందుకు ప్రకటించారో అర్థం చేసుకొనుటకు సహాయపడుతుంది. యేసు చెర నుండి పునరుద్ధరణను తెచ్చాడు. లూకా 4:18-19లో యెషయా 61:1-2ను యేసు ఉల్లేఖించాడు, మరియు ఆయన దీనిని తన జీవితముకు అనువర్తించుకున్నాడు:

> ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను. చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగిన వారిని విడిపించుటకును ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు (లూకా 4:18-19).

ఈ వాక్యభాగము స్పష్టము చేస్తున్నట్లుగా, యేసు తననుతాను చెర నుండి దేవుని ప్రజలను పునరుద్ధరించిన వానిగా పరిగణించుకున్నాడు.

క్రొత్త నిబంధన గ్రంథములోని రెండవ ముఖ్యమైన పదము కూడా ఇదే దృక్పథమును వెల్లడిస్తుంది. ఇది "రాజ్యము" అను పదము.

### రాజ్యము

క్రొత్త నిబంధన తరచుగా క్రొత్త నిబంధన యుగమును రాజ్య యుగము అని సంక్షిప్తీకరిస్తుంది. క్రొత్త నిబంధన గ్రంథములో ఈ పదము ఎందుకు అంత ప్రాముఖ్యమైనదిగా ఉంది? రాజ్యము అను పదము యేసు చెర తరువాత పునరుద్ధరణ నిరీక్షణలను నెరవేర్చాడని గుర్తిస్తూ క్రొత్త నిబంధన అంగీకరించిన మరొక మార్గముగా ఉంది. యెషయా 52:7లో చెర నుండి పునరుద్ధరణ జరుగబోయే విషయమును గూర్చిన యెషయా ప్రవచనమును వినండి. అక్కడ అతడు సువార్తను దేవుని పాలనతో అనుసంధానపరచాడు:

> సువార్త ప్రకటించుచు సమాధానము చాటించుచు సువర్తమానము ప్రకటించుచు రక్షణ సమాచారము ప్రచురించువాని పాదములు, "నీ దేవుడు ఏలుచున్నాడని" సీయోనుతో చెప్పుచున్న వాని పాదములు పర్వతముల మీద ఎంతో సుందరములై యున్నవి (యెషయా 52:7).

ఈ చివరి మాటలు – "నీ దేవుడు ఏలుచున్నాడు" – దేవుని ప్రజల యొక్క పునరుద్ధరణను మరియు ప్రపంచము మీద వారి యొక్క విజయమును ప్రకటిస్తాయి మరియు ఈ ప్రకటన దేవుని రాజ్యమును గూర్చిన యేసు బోధలకు నేపథ్యమును అందిస్తుంది. భూమి మీద దేవుని పరిపాలన స్థాపించబడింది గనుక తనలో పునరుద్ధరణ వచ్చిందని యేసు ప్రకటించాడు.

"అంత్యదినములు" లేదా చివరి సమయమును గూర్చిన క్రొత్త నిబంధన దృక్పథములను అర్థం చేసుకొనుటకు మూడవ వ్యక్తీకరణము కూడా మనకు సహాయము చేస్తుంది.

## అంత్యదినములు

పాత నిబంధన ప్రవక్తలు చెర తరువాత కాలమును వివరించడానికి అంత్య దినములు అనే పదమును ఉపయోగించారని మీరు జ్ఞాపకం చేసుకుంటారు. క్రొత్త నిబంధన కాలమును వివరించడానికి క్రొత్త నిబంధన రచయితలు కూడా ఇదే వ్యక్తీకరణమును ఉపయోగించారు. ఉదాహరణకు, అపొస్తలుల కార్యములు 2:17లో మనము ఈ మాటలు చదువుతాము:

> అంత్య దినములయందు నేను మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను (అపొస్తలుల కార్యములు 2:17).

పదే పదే, క్రొత్త నిబంధన రచయితలు క్రొత్త నిబంధన కాలమంతటినీ ఎస్కటాన్*,* లేదా అంత్యదినములుగా సూచిస్తారు. వారు పాత నిబంధన ప్రవచనాత్మక పదముల మీద ఆధారపడ్డారు గనుక వారు ఇలా చేశారు. వారు క్రొత్త నిబంధన యుగమును ప్రవచనాత్మక ప్రవచనములకు ముగింపుగా, దేవుని ప్రజల యొక్క పునరుద్ధరణగా చూశారు. క్రొత్త నిబంధన రచయితలు తమ యుగమును పాత నిబంధన యుగాంతశాస్త్ర నిరీక్షణలకు నెరవేర్పుగా చూశారని ఈ ముఖ్యమైన పదములు వెల్లడిచేస్తాయి. ఒక మాటలో చెప్పాలంటే, మానవ చరిత్ర యొక్క ముగింపు దశ క్రీస్తు ద్వారా వచ్చింది.

# నిర్మాణం

క్రొత్త నిబంధన యుగాంతశాస్త్రము యెడల ఈ ధోరణి పునరుద్ధరణ రాజ్యము కొరకు క్రొత్త నిబంధన వెల్లడిచేయు ప్రాథమిక నిర్మాణమును చూచు స్థితిలో మనలను ఉంచుతుంది. యుగాంతశాస్త్రమును గూర్చిన ఈ నూతన దృక్పథమును పరిశీలించాలంటే, క్రొత్త నిబంధనలో వివరించబడిన రెండు ప్రవచనములను మనం చూద్దాము: మొదటిగా, బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క ప్రవచనము, మరియు రెండవదిగా, యేసు యొక్క ప్రవచనము. బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క దృక్పథమును మొదటిగా చూద్దాము.

### బాప్తిస్మమిచ్చు యోహాను

అతని దినములలో దేవుని రాజ్యము పట్ల ప్రజలు సాధారణముగా కలిగి ఉన్న అవగాహనను బాప్తిస్మమిచ్చు యోహాను కూడా కలిగియున్నాడు. పాత నిబంధనను చదువుట ద్వారా, మెస్సీయ వచ్చినప్పుడు ఆయన దేవుని రాజ్యమును ఒకేసారి తీసుకువస్తాడు అని యోహాను నమ్మాడు. లూకా 3:16-17లో మెస్సీయను గూర్చి యోహాను ఎలా మాట్లాడాడో వినండి:

> **అయితే నాకంటె శక్తిమంతుడొకడు వచ్చుచున్నాడు … ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును; ఆయన చేట ఆయన చేతిలోనున్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రముచేసి, తన కొట్టులో గోధుమలుపోసి, ఆరని అగ్నితో పొట్టు కాల్చి వేయునని అందరితో చెప్పెను (లూకా 3:16-17).**

ఇశ్రాయేలు యొక్క పునరుద్ధరణ జరిగినప్పుడు, అది తక్షణ తీర్పు మరియు ఆశీర్వాదపు సమయముగా ఉంటుంది అని పాత నిబంధన ప్రవక్తలు నమ్మినట్లే, యోహాను కూడా నమ్మాడు.

### యేసు

తక్షణ తుది తీర్పు మరియు ఆశీర్వాదము అను ఈ పాత నిబంధన అంచనాల వలన, యోహాను మరియు ఇతరులు ఆశించినట్లుగా *ఎస్కటాన్* రావడము లేదు అని యేసు తన అనుచరులకు వివరిస్తూ తన పరిచర్యలో ఎక్కువ సమయం గడిపాడు. బదులుగా, దేవుడు పునరుద్ధరణను నిదానముగా తీసుకురావడానికి, కాలక్రమేణా విస్తరించునట్లుగా తీసుకురావడానికి నిర్ణయించుకున్నాడు. *యుగాంతశాస్త్ర*మును గూర్చి యేసు కలిగియున్న నూతన దర్శనము యొక్క స్పష్టమైన వ్యక్తీకరణము మత్తయి 13:31-35లోని రెండు ఉపమానములలో కనిపిస్తుంది: 31-35. ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను పరలోకరాజ్యము, ఒకడు తీసికొని తన పొలములో విత్తిన ఆవగింజను పోలియున్నది. పిండి అంతయు పులిసి పొంగువరకు మూడు కుంచముల పిండిలో దాచి పెట్టిన పుల్లని పిండిని పోలియున్నది. ఈ రెండు ఉపమానముల యొక్క తాత్పర్యము ఏమిటంటే పునరుద్ధరణ రాజ్యము తీర్పు మరియు ఆశీర్వాదముతో ఒకేసారి రావడం లేదు. బదులుగా, అది అభివృద్ధినొందుచు, లేదా దశల వారీగా వస్తుంది.

యేసు మరియు అపొస్తలుల ద్వారా బోధించబడిన యుగాంతశాస్త్రమును గూర్చిన క్రొత్త నిబంధన దృక్పథము ఆవిష్కృత యుగాంతశాస్త్రముగా పిలువబడుతుంది. ఈ అవిష్కృత యుగాంతశాస్త్రము అనేక విధాలుగా వివరించబడింది, అయితే దీనిని మూడింతల నిర్మాణముగా చూచుట సహాయకరముగా ఉంటుంది. మొదటిగా, క్రీస్తు రాకడ రాజ్యము యొక్క ఆవిష్కృతముగా పిలువబడుతుంది. క్రీస్తు జీవితము, మరణము, పునరుత్థానము, ఆరోహణము, పెంతెకొస్తు, మరియు అపొస్తలుల యొక్క పరిచర్యలు *ఎస్కటాన్* యొక్క పునాదిని లేదా ఆరంభమును ఏర్పాటు చేస్తాయి. క్రొత్త నిబంధన ప్రకారం, పునరుద్ధరణ యొక్క రెండవ దశ రాజ్యము యొక్క కొనసాగింపుగా పిలువబడుతుంది. ఇది మనము నేడు నివసించే కాలము – యేసు యొక్క మొదటి రాకడ తరువాత, కాని ఆయన రెండవ రాకడకు ముందు సమయము. పునరుద్ధరణ యొక్క మూడవ దశ రాజ్యము యొక్క నెరవేర్పుగా వివరించబడుతుంది. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, అనేక సంవత్సరముల క్రితము ప్రవక్తలు వాగ్దానము

చేసిన సంపూర్ణ పునరుద్ధరణను ఆయన తెస్తాడు. క్రొత్త నిబంధన అంతా ఆవిష్కృత యుగాంతశాస్త్రము యొక్క ఈ ప్రాథమిక నిర్మాణములో భాగమై ఉంది.

## అంశాలు

కొన్ని ముఖ్యమైన పదములు మరియు క్రొత్త నిబంధన దృక్పథముల యొక్క ప్రాథమిక నిర్మాణమును చూశాము గనుక, పాత నిబంధనలో అదే విధముగా క్రొత్త నిబంధనలో కూడా కనిపించే యుగాంతశాస్త్రమును గూర్చిన కొన్ని అంశములను మనము ఇప్పుడు చూద్దాము. రెండు ముఖ్యమైన అంశములను చూచుట సహాయకరముగా ఉంటుంది: చెర అను అంశము మరియు పునరుద్ధరణ అను అంశము.

### చెర

మొదటిగా, చెర అను అంశమును చూద్దాము. చెర అను పాత నిబంధన అంశము దేవుడు తన ప్రజలను యుద్ధము మరియు ప్రకృతి ద్వారా కలుగు తీర్పులతో బాధించాడను వాస్తవమును మీకు జ్ఞాపకం చేస్తుంది. చెరను గూర్చిన ఈ అంశాలు క్రొత్త నిబంధనలో ఆవిష్కృతము, కొనసాగింపు మరియు నెరవేర్పు యొక్క నిర్మాణములో చేర్చబడ్డాయి. మొదటిగా, క్రీస్తు ఆయన యొక్క భూలోక పరిచర్య సమయములో రాజ్యమును ఆరంభించినప్పుడు, నిబంధనా ప్రజల మీద ఆయన తీర్పును గూర్చిన మాటలను పలికాడు.

చెర అను అంశము రాజ్యము యొక్క కొనసాగింపుకు కూడా అనుసంధానించబడింది. ఒకవైపు, దేవుని ఆశీర్వాదములు పొందకుండునట్లు చేయు ఆత్మీయ చెర అను తీర్పు తమ మెస్సీయను సేవించుటకు తిరస్కరించిన అబ్రాహాము యొక్క భౌతిక సంతానమునకు కొనసాగుతుంది. వారు దేవుని రాజ్యము యొక్క ఆశీర్వాదముల నుండి మినహాయించబడ్డారు. మరోవైపు, దృశ్యమైన సంఘములోకి వచ్చిన అన్యజనుల విషయములో కూడా ఇదే జరుగుతుంది. సంఘ క్రమశిక్షణ, చెర యొక్క ముగింపు, సంఘములోని అన్యజనులు మరియు యూదులు దేవుని మీద తిరుగుబాటు చేసినప్పుడు తీర్పు ప్రకారం చెరగొనిపోబడతారు అని క్రొత్త నిబంధన పదే పదే స్పష్టం చేస్తుంది.

చివరిగా, రాజ్యము యొక్క ముగింపులో శాశ్వతమైన చెర కలుగుతుంది అని కూడా క్రొత్త నిబంధన బోధిస్తుంది. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, మతభ్రష్టుల మీద తీర్పరిగా ఉండి వారిని క్రొత్త ఆకాశములు మరియు క్రొత్త భూమికి దూరముగా నిత్యనాశనముకు ఆయన పంపుతాడు. ఈ మార్గములలో, చెర అను అంశము క్రొత్త నిబంధనలో నెరవేరినట్లుగా మనం చూస్తాము. అయితే ఈ నెరవేర్పు ఆవిష్కృతము, కొనసాగింపు మరియు నెరవేర్పు అను దశల ప్రకారంగా రూపొందించబడింది.

ఇప్పుడు, వాస్తవంగా చెప్పాలంటే, క్రొత్త నిబంధన గ్రంథము కేవలము చెర అను అంశమును గూర్చి మాత్రమే మాట్లాడదు. దేవుని ప్రజలకు పునరుద్ధరణ యొక్క ఆశీర్వాదములు క్రీస్తులో వచ్చాయని కూడా అది స్పష్టంగా బోధిస్తుంది.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## పునరుద్ధరణ

అంత్యదినములలో దేవుడు యుద్ధములో మరియు ప్రకృతి విషయంలో పరిమితి లేకుండా తన ప్రజలను ఆశీర్వదిస్తాడని పాత నిబంధన ప్రవక్తలు బోధించారు. ఈ పునరుద్ధరణ ఆశీర్వాదములు క్రీస్తు రాజ్యము యొక్క మూడు దశలలో కూడా వస్తాయని క్రొత్త నిబంధన బోధిస్తుంది.

మొదటిగా, రాజ్యము యొక్క ఆవిష్కృతములో, క్రీస్తు పరిచర్యను సూచించే అనేకమైన పునరుద్ధరణ అంశములను మనం చూస్తాము. దావీదు సింహాసనము పునఃనిర్మించబడుతుంది అని పాత నిబంధన ప్రవక్తలు చెప్పినట్లుగానే, యేసు “దావీదు కుమారుడు,” “రాజు” అని పిలువబడ్డాడు. అంత్యదినములలో దేవాలయము పునర్నిర్మించబడుతుంది అని పాత నిబంధన ప్రవక్తలు చెప్పినట్లుగానే, యేసు దేవుని ఆలయమై ఉన్నాడు. ప్రవక్తలు దుష్టత్వము మీద, అన్యరాజ్యముల మీద మరియు వారి దేవతల మీద గొప్ప విజయమును ప్రవచించినట్లే, సాతనును మరియు మరణ బలమును ఓడించుట ద్వారా యేసు తన ప్రజలకు విజయము తెచ్చాడు. పాత నిబంధన ప్రవక్తలు దేవుని ప్రజల కొరకు గొప్ప స్వాస్థ్యమును గూర్చి ప్రవచించినట్లే, యేసు మన స్వాస్థ్యము యొక్క ప్రాథమిక చెల్లింపుగా పరిశుద్ధాత్మను పంపాడు. మరియు, వాస్తవంగా చెప్పాలంటే, ప్రవక్తలు ప్రకృతి ద్వారా ఆశీర్వాదములను ప్రవచించినట్లుగానే, యేసు ఆయన పరిచర్యలో లెక్కలేనన్ని శారీరక స్వస్థత కార్యములు జరిగించాడు. యేసు యొక్క మొదటి రాకడ దేవుని ఆశీర్వాదముల కొరకైన చివరి గొప్ప పునరుద్ధరణకు ఆరంభము అని క్రొత్త నిబంధన బోధిస్తుంది.

రెండవదిగా, పునరుద్ధరణను గూర్చిన ఈ అంశములు రాజ్యము యొక్క కొనసాగింపును కూడా సూచిస్తాయి – క్రీస్తు యొక్క మొదటి మరియు రెండవ రాకడకు మధ్య సమయము. ప్రవక్తలు దావీదు కుమారుని కొరకు ప్రవచించినట్లే యేసు ప్రపంచము మీద రాజుగా పాలించుట కొనసాగిస్తున్నాడు. క్రీస్తు శరీరము దేవుని యొక్క అంత్యకాలపు ఆలయమును గూర్చిన పాత నిబంధన దర్శనములకు నెరవేర్పుగా ఉంది. సంఘము ఇప్పుడు దేవుని ఆలయముగా పిలువబడుతుంది. దేవుని ప్రజలు ప్రపంచము మీద జయము సాధిస్తారు అని ప్రవక్తలు చెప్పినట్లుగానే, సంఘము దుష్టత్వము మరియు ఆత్మీయ యుద్ధముల మీద జయము పొందుతుంది. పరిశుద్ధాత్ముడు మన సంపూర్ణ స్వాస్థ్యము యొక్క మొదటి చెల్లింపుగా సంఘములో కొనసాగుచున్నాడు. అంతేకాకుండ, క్రైస్తవులు ఎల్లప్పుడు దేవుని ప్రజల మీద భౌతిక స్వస్థత మరియు ఇతర ప్రత్యేక దైవకృత కార్యముల ద్వారా దేవుని ఆశీర్వాదమును చూస్తారు. ఇవి మరియు అనేక ఇతర మార్గములలో, పునరుద్ధరణ యొక్క గొప్ప వాగ్దానముల నెరవేర్పు క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో జరుగుతాయని క్రొత్త నిబంధన స్పష్టం చేస్తుంది.

మూడవదిగా, క్రీస్తు పునరుద్ధరణ ఆశీర్వాదములను ఆరంభించాడు మరియు కొనసాగిస్తున్నాడు అని మాత్రమే క్రొత్త నిబంధన బోధించుట లేదుగాని, రాజ్యము యొక్క ముగింపు పాత నిబంధనలోని పునరుద్ధరణ ఆశీర్వాదములను నెరవేర్పునకు తెస్తుందని కూడా అది బోధిస్తుంది. యేసు తిరిగి వచ్చినప్పుడు, దావీదు కుమారుడు రాజ్యములు అన్నిటిని ఏలుతాడు అని ప్రవక్తలు చెప్పినట్లుగానే ఆయన రాజత్వము ప్రపంచమంతటికీ విస్తరిస్తుంది. యేసు తిరిగి వచ్చినప్పుడు, పునరుద్ధరణ దేవాలయమును గూర్చిన వాగ్దానము దేవుడు సమస్త నూతన సృష్టిని ఒకే దేవుని ఆలయముగా రూపుదిద్దుతుండగా నెరవేరుతుంది. ఈ యుగము యొక్క ముగింపులో, దేవుని ప్రజలకు దుష్టత్వము మీద సంపూర్ణ విజయం లభిస్తుంది. దేవుని ప్రజలు నూతన సృష్టి యొక్క సంపూర్ణ స్వాస్థ్యమును

పొందుకుంటారు. మరియు, వాస్తవంగా చెప్పాలంటే, రక్షణ మహిమలో ప్రకృతి పరదైసుగా మారుతుంది, సంపూర్ణంగా నూతనపరచబడుతుంది. ఈ మార్గములలో మరియు మరిన్ని మార్గములలో, పునరుద్ధరణను గూర్చిన ప్రవచనములు క్రీస్తు తన రాజ్యమును ముగింపుకు తెచ్చినప్పుడు నెరవేర్చబడతాయి.

## ముగింపు

వివృతమగుచున్న యుగాంతశాస్త్రము అను ఈ పాఠంలో, చరిత్ర యొక్క ముగింపును గూర్చిన ప్రవచనములు, మోషే మొదలుకొని, ఆరంభ ప్రవక్తలు, తరువాత ప్రవక్తలు మరియు అటు తరువాత క్రొత్త నిబంధన వరకు ఎలా అభివృద్ధి చెందినవో మనం చూశాము. ప్రపంచము యొక్క ముగింపు కొరకు దేవుడు కలిగియున్న ప్రణాళికను ప్రతి అడుగులోను ఆయన ఎలా వెల్లడించాడో మనం చూశాము.

చెర అను తీర్పును గూర్చి పాత నిబంధన ప్రవచన గ్రంథములు మాట్లాడుటను మనం చదువునప్పుడెల్లా, క్రొత్త నిబంధన దృక్పథములో నుండి దీనిని మనం చూడాలి. నిబంధనను ఉల్లఘించువారికి రాజ్యము యొక్క ఆవిష్కృతములో, రాజ్యము యొక్క కొనసాగింపులో, మరియు నెరవేర్పు, లేదా రాజ్యము యొక్క నెరవేర్పులో చెర ఉంటుంది. పునరుద్ధరణ అను భవిష్యత్ ఆశీర్వాదములను గూర్చి పాత నిబంధన ప్రవచన గ్రంథములు మాట్లాడుటను మనం చదువునప్పుడెల్లా, ఈ ఆశీర్వాదములు క్రీస్తు రాజ్యము యొక్క ఆవిష్కృతములోను, కొనసాగింపులోను, మరియు ముగింపులోను వస్తాయని మనం ఎల్లప్పుడు జ్ఞాపకం ఉంచుకోవాలి. ఈ దృక్పథములను మనము దృష్టిలో ఉంచుకొనినట్లైతే, పాత నిబంధన ప్రవచన గ్రంథములను క్రొత్త నిబంధన రచయితలు మరియు యేసు దృష్టిలో మనం చూడగలుగుతాము.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి